సంక్షేమ సేవకులు వలంటీర్లు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- సేవా వజ్ర, రత్న, మిత్ర అవార్డుల ప్రదానం



హాజరైన వలంటీర్లు



వలంటీర్లకు అవార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: వలంటీర్లు సంక్షేమ సేవకులని భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్త కొవ్వాడలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర ఇద్దరు, రత్న ఐదుగురు, మిత్ర 283 మంది వలంటీర్లకు ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయాలకు అనుసంధానంగా రెండున్నర లక్షల మంది వలంటీర్లను నియమించి, పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని పార్టీలకు అతీతంగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే ప్రాధాన్యతను వలంటీర్లు గుర్తించుకోవాలన్నారు. టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు కూడా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వెంకటాపురం, పెంట, చిన్నాపురం పంచాతీయల సర్పంచ్‌లు టీడీపీ సానుభూతిపరులు గెలిచినప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ఈ పంచాయతీల్లో అధిక శాతం చేపట్టామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తారని చెప్పారు. టీడీపీ, సినిమా పార్టీల మాటలు నమ్మొద్దని కోరారు. పద్మనాభం మండలంలో ఈ ఐదేళ్లలో సంక్షేమ పథకాలకు రూ.372 కోట్లు, అభివృద్ధికి రూ.140 కోట్లు వెచ్చించామన్నారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకిచ్చిన గుర్తింపును జన్మలో మరిచిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు , వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, సర్పంచ్‌లు పొన్నకాయల రత్నం, చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యులు బోని రమణమ్మ, సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, మరగడ అప్పారావు, సిరుగుడి ఆదినారాయణ, మాదిరెడ్డి భాస్కరరావు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, బుగత సత్యనారాయణ, మామిడి శివ రామకృష్ణ, బూసురోతు అప్పారావు, బొలె అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, ఈర్ల ఈశ్వరరావు, ఎంపీడీవో బి.శైలజ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పలరాజు

ఆనందపురం : మొక్కలను విరివిగా పెంచడం వలన వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని కణమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము చెప్పారు. శొంఠ్యాంలోని ఎస్ఎస్ఆర్‌బీటీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కణమాంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలరాము మాట్లాడుతూ విచక్షణ రహితంగా చెట్లను, మొక్కలను తొలగించడం వలన వాతావరణం సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దీని వలన కాలుష్యం పెరిగి ప్రజల జీవన విధానాలు గతి తప్పుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో హరగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో వారం రోజులు పాటు సేవా శిబిరం కొనసాగుతుందని, వివిధ అంశాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్, డైరెక్టర్ రాజ మురుగుదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఈ నెల 25న ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. విజేతలకు 28న బహుమతులు అందిస్తామన్నారు. భారతరత్న సీవీ రామన్ జీవిత విశేషాలపై వ్యాసరచన పోటీలు, డాక్టర్ సీవీ రామన్ ఎఫెక్ట్ అనే అంశంపై ఉపన్యాస పోటీలు, జాతీయ సమైక్యత పెంపొందించే అంశంపై చిత్రలేఖన పోటీలను తెలుగు, హిందీ భాషల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీలు 6,7 తరగతుల విద్యార్థులను మొదటి కేటగిరీగా, 8,9,10వ తరగతి విద్యార్థులను రెండో కేటగిరీగా, ఇంటర్మీడియట్ విద్యార్థులను మూడో కేటగిరీగా, డిగ్రీ విద్యార్థులను నాలుగో కేటగిరీగా, పాలిటెక్నిక్, డైట్ విద్యార్థులను అయిదో కేటగిరీగా, పీజీ విద్యార్థులను ఆరో కేటగిరీగా విభజించి నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీబీపై విద్యార్థులకు అవగాహన



వాంబే కాలనీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

మధురవాడ: విద్యార్థులు వ్యాధులపై అవగాహన పెంచుకోవడం అవసరమని వాంబే కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుస్మిత అన్నారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా మధురవాడలోని చంద్రంపాలెం, వాంబే కాలనీ సునీల్‌శర్మ కాలనీల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మధురవాడ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తపు జీరలతో పాటు కఫం పడడం వంటి లక్షణాలు ఉంటే అది క్షయ కావడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కఫం పరీక్షలు చేయించుకోవడంతో పాటు క్షయ వ్యాధి నిర్ధారణ అయితే సదరు పేషెంట్‌కు ఉచితంగా ట్రీట్‌మెంట్, మందులు కూడా అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సునీల్‌శర్మ కాలనీ హెచ్‌ఎం గీతాదేవి, మధురవాడ టీబీ యూనిట్ ప్రతినిధులు వి.వీరబ్రహ్మం, ఎస్.సురేష్, కృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ సాయికుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ వీసీ రవిరాజు, డీన్ సుధాకర్

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో శుక్రవారం 4వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. 2018–19 సంవత్సరంలో చేరి వైద్యవిద్యను పూర్తి చేసిన వారికి మెడికల్ పట్టాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి డాక్టర్ టి.రవిరాజు పాల్గొన్నారు. బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ రంప సాయికుమార్‌ను గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, ఆంధ్రా మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రాధా, విశ్రాంత డీజీపీ ఎన్ఆర్‌కె రెడ్డి, కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కృష్ణమూర్తి శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఏవో పాటిబండ్ల శివప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి శిష్టకరణాల మద్దతు



డబ్బీరు ప్రశాంతిని సత్కరిస్తున్న శిష్టకరణాల సంఘం ప్రతినిధులు

పీఎం పాలెం: శిష్టకరణాల ఉన్నతికి ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీ గెలుపునకు ఐక్యంగా కృషి చేస్తామని ఏపీ శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు లయన్ డొంకాడ అనిల్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ప్రముఖ శిష్టకరణాల ప్రతినిధులను పీఎం పాలెంలో శుక్రవారం ఆయన సత్కరించారు. మునుపెన్నడూ లేనివిధంగా తమ సామాజికవర్గం అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే చెందుతుందన్నారు. రాష్ట్ర శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, రాష్ట్ర శిష్టకరణాల సంఘం అధ్యక్షుడు ఎస్.ఎన్.కె.మహంతి సూచనలతో సంఘం ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ఏపీ సంఘం ప్రధాన కార్యదర్శి అరికతోట చంద్రమౌళి, మహిళా విభాగం కార్యదర్శి మండవ కురిటి లక్ష్మిలను ఘనంగా సన్మానించారు. స్థానిక నాయకులు డొంకాడ వసంత, పి.దుర్గా భవాని, పి.సతీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిను ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లారు. స్వామిని అభిషేకించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

కల్లివానిపాలెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ దరి కల్లివానిపాలెంలో గాయత్రి విద్యాపరిషత్ కాలేజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలకు నీటి సంరక్షణ, వృక్ష సంపద, మహిళా సాధికారత, స్వచ్ఛభారత్ అభియాన్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు పిల్లల్లో ఉత్సాహం, ఉల్లాసం నింపేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ వంశీ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ సి.వి.నాగేశ్వరరావు, 4వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, ఎం.డ్రెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా పద్మావతి



మధురవాడ: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా విశాఖ జిల్లా మధురవాడకు చెందిన చంద్ర పద్మావతి ఎన్నికయ్యారు. ఈమె పీఎం పాలెం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారికి రావలసిన పెండింగ్ బకాయిలు విడుదల అయ్యే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈమెకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నూకాలమ్మ ఉత్సవాల కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ తల్లి ఉత్సవాలను ఏప్రిల్ 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆహ్వానించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉత్సవ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడితూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీరుపల్లి రాజా, కోశాధికారి రాకోతు నర్సింగరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగిరెడ్డి వెంకటస్వామి, కో–ఆర్డినేటర్ అప్పికొండ బాలకృష్ణ, పెద్దలు కంటుభుక్త ముత్యాలరావు, అల్లిపిల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కృష్ణాపురంలో ఈ నెల 25న ఇండియన్ బ్లడ్ బ్రదర్స్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరగనుంది. ఈ మేరకు పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వేకువజామునే జెడ్సీ పర్యటన

పారిశుధ్య నిర్వహణపై ఆరా



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి శుక్రవారం వేకువజామునే పరిశీలించారు. వార్డులో పలు చోట్ల పర్యటించిన ఆమె పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అనంతరం జేవీ అగ్రహారంలో స్థానికులతో మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటిస్తే మురుగు నీరు, నిల్వ నీరు పోతుందని, తద్వారా దోమలకు చెక్ పెట్టవచ్చన్నారు. పూల కుండీలలో, పాత టైర్లలో, అదే విధంగా పరిసర ప్రాంతాల్లో నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, ఎస్.పైడిరాజు, పి.బాలాజీ, కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

హరిత పెట్టుబడులకు అపార అవకాశాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శంకర్రావు

కొమ్మాది: కోవిడ్ మహమ్మారి ప్రభావం అనంతరం ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణానికి, సుస్థిర అభివృద్ధికి, హరిత టెక్నాలజీకి ప్రాధాన్యత పెరుగుతోందని ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ అఫ్ ఇండియా మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డా.ఇమంది శంకర్రావు తెలిపారు. ముఖ్యంగా హరిత పెట్టుబడులకు అపార అవకాశాలు ఏర్పడుతున్నాయన్నారు. సుస్థిర ఆర్థిక ప్రగతి పైఫిన్ ఫోజియం 1.0 పేరిట గీతంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత వాణిజ్య రంగంలో హరిత సాంకేతిక రంగానికి, సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పాదక రంగంలో పెట్టుబడులు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. ఇటీవల బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ. 11.11 లక్షల కోట్లు హరిత ఆర్థిక కార్యకలాపాలకు కేటాయించిందని వివరించారు.

కేజీహెచ్‌లో పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్

- 27న ప్రారంభించనున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని
- రూ.80 లక్షల వ్యయంతో పలు సౌకర్యాల ఏర్పాటు



యూనిట్‌లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

మహారాణిపేట : కేజీహెచ్ పిల్లల వార్డులో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ) ఈ నెల 27న ప్రారంభం అవుతుంది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈ యూనిట్‌ను ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మొత్తం 40 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ఒక ఏడాది నుంచి ఏడు సంవత్సరాల లోపు పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం చికిత్స అందిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ నిధులు రూ. 20 లక్షలు, కేజీహెచ్ నిధులు రూ.20 లక్షలు, కలెక్టర్ మల్లికార్జున అందించే సీఎస్ఆర్ ఫండ్ రూ. 40 లక్షలతో ఈ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. వెంటిలేటర్ వంటి సదుపాయాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. అలాగే కేజీహెచ్‌లో 120 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు.

ఏవీఎన్ కళాశాలకు బీఎన్ రెడ్డి విరాళం



విరాళం అందజేస్తున్న ఇంద్రజాలికుడు బీఎన్ రెడ్డి

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన ఇంద్రజాలికుడు బీఎన్ రెడ్డి తాను చదివిన ఏవీఎన్ కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడుకు ఈ మొత్తం చెక్‌ను అందజేశారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో కళారంగంలో ప్రతిభ చూపే కళాశాల విద్యార్థికి ఏటా నగదు పురస్కారం అందజేయనున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బీఎన్ రెడ్డి ఇంద్రజాల విద్యలో అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందడం తమకు ఎంతో గర్వకారణమని భానోజీరావు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని, ఇందుకు నవరత్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో అమలే నిదర్శనమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధురవాడ సంపత్‌నగర్‌లో నిర్వహించిన సభలో ముత్తంశెట్టి మాట్లాడుతూ కరోనా సమయంలో గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజా సాధికార సర్వే నిర్వహించి దేశంలో అత్యధికంగా వ్యాక్సినేషన్ పూర్తి చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశేనని దేశ ప్రధానే కొనియాడారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో రూ.250 కోట్లు అభివృద్ధి కోసం ఖర్చు చేశామన్నారు. గతంలో ఈ సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు తాము కూడా అమలు చేస్తామని చెబుతున్నారన్నారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పని చేస్తున్నారన్నారు. ఇక్కడ రూ.18.50 లక్షలతో చేపట్టే పార్కు అభివృద్ధి పనులు వారం రోజుల్లోనే ప్రారంభించి, సత్వరమే పూర్తి చేస్తామని చెప్పారు. ఏఈ సురేష్, భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పిల్లా సూరిబాబు, పోతిన ఎల్లాజీ, సంపత్ నగర్ కాలనీ నాయకులు వెంకటేశ్వర్లు, అజయ్‌బాబు, రాజీవ్‌లోచన పాల్గొన్నారు.

తాటితూరు విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

తగరపువలస: స్కౌట్ ఉద్యమ స్థాపకుడు బెడన్ పావెల్ జయంతి సందర్భంగా గురువారం పెదగంట్యాడ ఐటీఐలో నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. ఆలోచనా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో తమ విద్యార్థులు ఈ బహుమతులు గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయుడు డొకర శ్రీనివాసరావు, స్కౌట్ యూనిట్ ఇన్‌స్ట్రక్టర్ టి.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా




కొమ్మాది: నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ముస్లింలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు కేవీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముస్లింల ద్రోహి అని టీడీపీ నేత నజీర్ విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రభుత్వ పథకాలను దళారీ వ్యవస్థలు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేసి, పేదవారికి అండగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇష్టానుసారం దోచుకునేవని, కానీ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతికి, లంచాలకు తావు లేకుండా వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి వైఎస్ జగన్ జన హృదయ నేతగా నిలిచారన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 24 వేల కోట్లు అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిది అన్నారు. నాడు చంద్రబాబు పాలనలో షాదీ తోఫా కింద రూ. 50 వేలు అందిస్తే నేడు సీఎం జగన్ రూ. లక్ష అందిస్తున్నారని, 2022–23 హజ్ యాత్రలకు వెళ్లిన 2977 హాజీలకు రూ. 20కోట్ల 3 లక్షలు ఖర్చు పెట్టిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు.

మైనారిటీల పక్షపాతి సీఎం జగన్

ఆక్రమణలకు గురైన 32 వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు స్వతంత్ర అధికారాలు ఇస్తూ వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన మైనారిటీల పక్షపాతి సీఎం జగన్ అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఇమామ్‌లకు ఇచ్చే రూ. 5వేలును పదివేలకు, మౌజన్‌లకు ఇచ్చే రూ.3 వేలను రూ.5వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చంద్రబాబు ముస్లింలను రాజకీయంగా అభివృద్ధి చేయలేదని.. కానీ సీఎం జగన్ ఒక ఉపముఖ్యమంత్రిని, ఒక శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌ను, నలుగురు ఎమ్మెల్యేలను, నలుగురు ఎమ్మెల్సీలను, ఇద్దరు మేయర్లను, 11మంది మున్సిపల్ చైర్‌పర్సన్లను ఇచ్చి మైనారిటీలకు రాజకీయంగా గుర్తింపునిచ్చారన్నారు. నాటికి, నేటికి ముస్లింలకు ఏం అభివృద్ధి జరిగిందో తేల్చుకునేందుకు టీడీపీ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు.

ఏపీఎఫ్ఏ లీగ్ ఫుట్‌బాల్ పోటీలకు పోలమాంబ క్లబ్

తగరపువలస: రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ రైల్వే గ్రౌండ్‌లో ప్రారంభమైన ఏపీఎఫ్ఏ లీగ్ పోటీలలో చిట్టివలస పోలమాంబ క్లబ్ పాల్గొంటుందని ఆ జట్టు ప్రధాన కార్యర్శి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ 25 జట్లు పాల్గొనే ఈ లీగ్‌లో 4 జట్లు రాష్ట్రస్థాయికి ఎంపిక అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజారావు, ఏపీఎఫ్ఏ క్లబ్ చాంపియన్‌షిప్ మ్యాచ్ కమిషనర్ రామకృష్ణ, గోవింద్, మాని, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



లీగ్ పోటీల ప్రారంభంలో చిట్టివలస పోలమాంబ క్లబ్ కార్యదర్శి చినబాబు